సందడిగా సంక్రాంతి సంబరాలు



16వ వార్డులో ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి



15వ వార్డులో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ, పార్టీ నాయకుడు అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం : తూర్పు నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్, పార్టీ నాయకుడు జీవీ ముఖ్యఅతిథులుగా ప్రారంభించారు. మహిళలు వేసిన ముగ్గులను తిలకించి అభినందించారు. అనంతరం పోటీలలో విజేతలకు ఎంపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రదీప్, పోల రత్నం పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 15వ వార్డులో సంక్రాంతి ముగ్గుల పోటీలను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గున్నమనేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ముగ్గులను తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా షాలిని, భాను వ్యవహరించారు. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న వారందరికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మైదానంలో పల్లె వాతావరణం

ఏయూక్యాంపస్: ఏయూ మైదానంలో సంక్రాంతి వేడుకల ప్రాంగణాన్ని పల్లె వాతావరణాన్ని తలపించేలా తీర్చిదిద్దారు. పూరిళ్లు, ఎద్దుల బండి, ఒంగోలు ఎద్దుల నమూనాలు, సైకత శిల్పాలతో పట్టణ వాసులకు పూర్తి స్థాయిలో పల్లె సంస్కృతి, సాంప్రదాయాలను పరిచయం చేసే విధంగా ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మహా సంక్రాంతి సంబరాలను ఎంపీ జీవీఎల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ పల్లె సంస్కృతిని చాటేలా సంక్రాంతి సంబరాలను నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో భాగంగా 13న గాయని మోహన భోగరాజు, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ ప్రదర్శనలు, సినీనటుడు సాయికుమార్ వస్తున్నారన్నారు. 14న కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్, బీజేపీ ఎంపీ నిరాహ్వాలు హాజరవుతారన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు భోగీ మంటలు వేస్తామన్నారు. సాయంత్రం ఇదే వేదికపై 1000 మంది చిన్నారులకు భోగిపళ్లు పోస్తామని చెప్పారు. అయోధ్య శ్రీరామాలయం త్రీడి నమూనాను ప్రదర్శిస్తామన్నారు. బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నగరవాసులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రసాదాలు పంపిణీ ప్రత్యేకంగా చేపడుతున్నామన్నారు.



పులి వేషాల సందడి



గంగిరెద్దులు, హరిదాసుల సందడి



తప్పెటగుళ్లు కళాకారుల నృత్యం



వేడుకలను తిలకిస్తున్న ఎంపీ జీవీఎల్

బడుగుల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 18వ వార్డులో పాదయాత్ర



ఎంపీ ఎంవీవీకి హారతి పడుతున్న మహిళ

ఎంవీపీ కాలనీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం 20వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం 18వ వార్డులో పర్యటించారు. మూలపాలెం, వాసవానిపాలెం, గోవాగార్డెన్, గొల్లవీధి ప్రాంతాల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితో పాటు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎంపీకి హారతి ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఇంటి అభివృద్ధికి సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు దోహదం చేస్తున్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాలను విద్య, సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులను అభినందిస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో భాగం కావడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. సమూహంగా పనిచేయడం, కార్యసాధక నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరిధిలోని జీవీపీ కళాశాల విద్యార్థిని జి.కావ్య దేవి, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థిని ఎ.చూడామణి, ఏయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామరాజు, టీఎస్ఆర్-టీబీకే డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వమోహన్ హైదరాబద్‌లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొననున్నారు.

సుబ్రహ్మణ్యశర్మకు జర్నలిజంలో డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మకు జర్నలిజంలో డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యుడు డాక్టర్ చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో ×ప్రేక్షకుల భావోద్వేగాలపై తెలుగు సినిమాల ప్రభావం×అనే అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. భావోద్వేగాలు తెలుగు సినిమా జయాపజయాలను, ప్రేక్షకుల ఆదరణను ప్రభావితం చేస్తాయని తన పరిశోధనలో వివరించారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సుబ్రహ్మణ్యశర్మ స్వీకరించారు.

క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బోనెల యేసుబాబు, కటికల కల్పన, ఏయూ ఆచార్యులు ఎస్.ఎ.డి.పాల్, ఆచార్య టి.సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న గాంధీనగర్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యురాలు ప్రవళిక రక్తదానం చేసిన యువకులను అభినందించారు.

పోరాటంతోనే ఉక్కు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జగ్గునాయుడు

మద్దిలపాలెం : సీపీఎం సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఉక్కు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. శుక్రవారం పిఠాపురం కాలనీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 38 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితం లభించిదన్నారు. 97 మంది నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆలస్యంగా బయల్దేరిన శ్రీకాకుళం-వికారాబాద్ స్పెషల్

తాటిచెట్లపాలెం: శ్రీకాకుళం రోడ్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బయల్దేరవలసిన శ్రీకాకుళం రోడ్-వికారాబాద్(08547) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్‌లకు చేరుకోనుంది.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు, చిన్నారులు

సీతమ్మధార: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెంలోని మదీనా మెమోరియల్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హజరత్ ఖాదర్ వలీ, హజరత్ మౌలా అలీ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మసీదుల్లో ముస్లింలు ఖురాన్ పఠించి చిన్నారులచే నాతే కలం ఆలపించారు. పరిసర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీ చేసి, పాతీహఖానీ జరిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులచే ప్రత్యేక కార్యక్రమం, ఆదివారం కవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రాక్పశ్చిమ సమన్వయం ఒక యజ్ఞం



మాట్లాడుతున్న లుడ్జర్

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో-ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్జర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్జర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. స్పెయిన్ వనిత డోనా, అర్జెంటినాకు చెందిన రేయస్స్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎస్ఎస్ఎస్ రాము, బాల భాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల నృత్య కళాకారులకు టర్కీ డిప్లొమాలు



డిప్లొమా పత్రాలతో బాల నృత్య కళాకారులు

సీతమ్మధార: టర్కీ ఇస్తాంబుల్‌కు చెందిన ఫోక్‌లెర్ బోజాజిక్ సాంస్కృతిక సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌లో విశాఖ జిల్లాకు చెందిన బహుభాషా బాల నృత్య కళాకారులకు డిప్లొమాలు లభించాయి. ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ సంస్థ ప్రతి ఏడాది అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తోంది. గతేడాది విశాఖకు చెందిన బాహుభాషా నృత్య కళాకారిణి ఆర్.హర్షిత టీనా అత్యధిక మార్కులతో అంతర్జాతీయ నృత్య డిప్లొమాను అందుకుంది. ఈ ఏడాది డ్యూయెట్ జానపద విభాగంలో బట్టు అనురాధ(తగరపువలస), వేటూర కమలిని శ్రీవర్ష(సీతమ్మధార), సోలో సీనియర్స్ విభాగంలో గోకా డింపుల్(ఆశీలమెట్ట), మంత్రి మోక్షిత(మద్దిలపాలెం), సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్.అనన్య(సింహాచలం), బోగాది వర్షిణి(వేపగుంట), బి.పూజిత చందన(బాలయ్యశాస్త్రి లేఅవుట్), నందూరి జోషిత(కంచరపాలెం), ఎస్.ఎస్.ఎస్.వైష్ణవి(సింహాచలం)లకు ప్రథమ, ద్వితీయ స్థాయి డిప్లొమాలు లభించాయి. గతంలో న్యూఢిల్లీ, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్ వంటి ప్రాంతాల్లో జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని వీరు అవార్డులు అందుకున్నారు. వీళ్లంతా నగరానికి చెందిన స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ నాగరాజు పట్నాయక్ వద్ద నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



రూల్స్ పాటించని ద్విచక్ర వాహన చోదకులకు సూచనలిస్తున్న సీఐ అమ్మినాయుడు

సీతమ్మధార: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే, దొండపర్తి, డైమండ్ పార్కు, 80 అడుగుల రోడ్డు పరిసర ప్రాంతాల్లో రెడ్ సిగ్నల్స్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్ సిగ్నల్ క్రాస్ చేస్తూ నిబంధనలు పాటించని పలువురు వాహన చోదకులను హెచ్చరించి, కౌన్సెలింగ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల రోడ్డు నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్ల కుటుంబ సభ్యులను సీఐ పిలిపించి మాట్లాడారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ వి.వాణిశ్రీ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం



పెళ్లికూతురుగా గోదాదేవి అమ్మవారు

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 28వ రోజు కార్యక్రమంలో భాగంగా కూడారై ఉత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా చేపట్టారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామి వారికి తిరుప్పావై 28వ పాశురం విన్నవించుకున్నారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం మండపంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తయారు చేసిన కుడారై పాయసాన్ని 108 మట్టి కలశాలలో నివేదించారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించి పాయసంతో కూడిన కుండలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడు



రామకృష్ణ మిషన్ వద్ద వివేకానందుని కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న గొండు సీతారాం



ఏయూలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాతగా స్వామి వివేకానందుడు నిలుస్తారని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఈసీ హాల్‌లో స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వామి వివేకానంద సందేశం యువతకు శిరోధార్యమన్నారు. సనాతన ధర్మానికి రాయబారిగా, మహోన్నత వాగ్ధాటితో భారతదేశ సంస్కృతి వారసత్వాన్ని ప్రపంచానికి వివేకానంద పరిచయం చేశారన్నారు. భారతీయ యువతకు దిశానిర్దేశం చేసిన ఆయన నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. భారతీయుల్లో జాతీయవాద స్ఫూర్తిని నింపడంలో, యువతకు మార్గనిర్దేశం చేయడంలో ఆయన ప్రసంగాలు ఎంతో ప్రభావవంతంగా నిలిచాయన్నారు. వివేకానందుని బోధనలు మానవాళికి మార్గదర్శనం చేస్తూనే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రహమాన్, ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏపీ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ అహ్మద్ నజీర్, అధికారులు పాల్గొన్నారు.

బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఎంవీపీ కాలనీ: స్వామి వివేకానంద జయంతిని ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానందుడి చిత్ర పటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు, బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని ఆశయ సాధనే లక్ష్యం

బీచ్ రోడ్డు: వివేకానందుని ఆశయ సిద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రామకృష్ణ మిషన్ వద్ద వివేకానందుని కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర అవసరమన్నారు. యువత చెడు మార్గం వైపు మరలకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. దేశ నిర్మాణంలో యువత మరింత చొరవ చూపితే మంచి అభివృద్ధి సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామీజీ గీతా సదానంద, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, మారుతి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ 12వ వార్డు మయూరినగర్ పార్కులో వివేకానంద జయంతి నిర్వహించారు. వేదిక సభ్యుడు నర్సింగరావు నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు, పిల్లలు పార్కులో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు చాక్లెట్లు, పెద్దలకు వివేకానందుని పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరహాలు, లొలుగు ధర్మారావు, కె.మోహనరావు, సూర్యారావు, రవికుమార్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మయూరినగర్ పార్కులో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెద్దలు, పిల్లలు

తీర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి



సుందరీకరణపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : విశాఖ సాగర తీరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఆర్కేబీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు సెంట్రల్ మీడియన్, గార్డెన్లు, వర్టికల్ గార్డెన్లు, పలు రోడ్లు, ఫుట్‌పాత్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు ఎంతో సువిశాలమైన తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తారని, వారందరికీ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చర్ దామోదరరావును ఆదేశించారు. అలాగే సెంటర్ మీడియన్‌లో ఆకర్షణీయమైన మొక్కలు దగ్గరగా వేసి నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్ల వద్ద రోడ్లపై పడిన మట్టిని వెంటనే స్వీపింగ్ మెషీన్ల ద్వారా పరిశుభ్రపరచాలని ఆదేశించారు. కొన్ని చోట్ల మొక్కల నిర్వహణ సరిగ్గా లేదని, పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీడీహెచ్‌ను ఆదేశించారు. గాదిరాజు ప్యాలెస్, ఇతర బీచ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్లను అందంగా తీర్చిదిద్దుతూ నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్‌లో మొక్కలను పశువులు తినకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర వాసుల పల్లెబాట



ఎన్ఏడీ సెంటర్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

విశాఖ విద్య: తెలుగింట పెద్ద పండగకు నగర వాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో ఎన్ఏడీ సెంటర్ ప్రయాణికులతో రద్దీగా మారింది. విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఎక్కువ మంది స్వగ్రామాలకు వెళ్లేందుకు క్యూ కట్టారు. ఎన్ఏడీ బస్టాప్‌లో ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎన్ఏడీ చుట్టు పక్కల ప్రాంతాల వారు ఇక్కడే బస్సులు ఎక్కేందుకు వస్తారు. దీంతో రద్దీని నియంత్రించేందుకు ఆర్టీసీ సిబ్బందిని నియమించింది.

అర్హులందరికీ ఓటు హక్కు

విశాఖ విద్య: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని విశాఖ ఆర్డీవో, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ అన్నారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితాల తయారీపై మండలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాజా నివేదికల మేరకు సిద్ధం చేసిన ఓటరు జాబితాలు, వాటిపై అభ్యంతరాలను రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పొందేందుకు గడువు లోగా అందిన దరఖాస్తులు, అదే విధంగా చేర్పులు-మార్పులపై క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై మండల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు లేవనెత్తిన అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల ఉండటానికి వీల్లేదన్నారు. ప్రతీ దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందన్నారు. ఉన్నతాధికారులు ఏ సమాచారం కోరినా వెంటనే పంపించేలా సమగ్ర నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తుది జాబితాను ఈ నెల 22న ప్రకటించడం జరుగుతుందన్నారు.